సాక్షి వికారాబాద్

బుధవారం । 4 । అక్టోబర్ । 2023



మిత్తీ మరిచారు

డ్వాక్రా మహిళలు బ్యాంకుల నుంచి తీసుకున్న రుణాలకు ప్రభుత్వం వడ్డీ చెల్లించాల్సి ఉన్నా కట్టడం లేదు. 8లో▸



మూగ వేదన అరణ్య రోదన

అసలే సీజనల్ వ్యాధులు. ఆపై సిబ్బంది కొరతతో పశు వైద్యశాల మూతపడింది. దీంతో రైతులు ఇబ్బందులు పడుతున్నారు. 9లో▸



ప్రజా సంక్షేమమే లక్ష్యం

ప్రజా సంక్షేమమే లక్ష్యంగా ప్రజాప్రతినిధులు, అధికారులు సమన్వయంతో పనిచేయాలని ఎమ్మెల్యే ఆనంద్ అన్నారు. 9లో▸

న్యూస్‌రీల్

'కోడ్' వచ్చేలోగా అభివృద్ధి పనులు ప్రారంభమవ్వాలి

కలెక్టర్ నారాయణరెడ్డి



వికారాబాద్ అర్బన్: ఈ నెల 5వ తేదీ తరువాత ఎప్పుడైనా ఎన్నికల కోడ్ వచ్చే అవకాశం ఉందని, అప్పటిలోగా అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలను పూర్తి చేసుకోవాలని కలెక్టర్ నారాయణరెడ్డి అధికారులను ఆదేశించారు.మంగళవారం టెలికాన్ఫరెన్స్ ద్వారా అధికారులతో మాట్లాడారు. త్వరలో ఎన్నికల కోడ్ వచ్చే అవకాశం ఉన్నందున ఇప్పటికే పూర్తయిన అభివృద్ధి పనులకు స్థానిక ప్రజాప్రతినిధుల సహకారంతో ప్రారంభోత్సవాలు చేయించాలని సూచించారు. జిల్లాలో ని అన్ని గ్రామ పంచాయతీల్లో స్పోర్ట్స్ కిట్స్ పంపిణీకి ఏర్పాట్లు చేసుకోవాలన్నారు. ఎన్నికల కోడ్ అమల్లోకి వచ్చిన తర్వాత ఎలాంటి కార్యక్రమాలు చేపట్టడానికి వీలుండదని అధికారులకు తెలిపారు. సమావేశంలో జిల్లా అదనపు కలెక్టర్లు, ఆర్డీఓలు, జిల్లా అధికారులు, ఎంపీడీవోలు, మున్సిపల్ కమిషనర్లు పాల్గొన్నారు.

కేటీఆర్ పర్యటనకు ముమ్మర ఏర్పాట్లు



బహిరంగ సభ జరిగే ప్రదేశాన్ని పరిశీలిస్తున్న ఎంపీ, ఎమ్మెల్యే, కలెక్టర్ తదితరులు

వికారాబాద్ అర్బన్: ఈ నెల 5న వికారాబాద్‌లో పలు అభివృద్ధి కార్యక్రమాల ప్రారంభోత్సవానికి మంత్రి కేటీఆర్ వస్తున్నందున ఏర్పాట్లు యుద్ధ ప్రాతిపాదికన జరుగుతున్నాయి. మంగళవారం చేవెళ్ల ఎంపీ గడ్డం రంజిత్‌రెడ్డి, ఎమ్మెల్యే డాక్టర్ మెతుకు ఆనంద్, కలెక్టర్ నారాయణరెడ్డి, ఎస్పీ కోటిరెడ్డి తదితరులు క్షేత్రస్థాయిలో ఏర్పాట్లను పరిశీలించారు. అభివృద్ధి కార్యక్రమాల ప్రారంభోత్సవం తరువాత బ్లాక్ గ్రౌండ్‌లో నిర్వహించే బహిరంగ సభ వేదికను పరిశీలించారు. ఏఏ మండలాల వారికి ఎక్కడ పార్కింగ్ ఏర్పాటు చేయాలనే విషయంపై స్థానిక నాయకులతో కలిసి చర్చించారు.

రేపు ఎన్‌రోల్‌మెంట్ డ్రైవ్

వికారాబాద్ అర్బన్: జిల్లా ఎంప్లాయిమెంట్ కార్యాలయంలో ఈ నెల 5న ఎన్‌రోల్‌మెంట్ డ్రైవ్ కార్యక్రమం నిర్వహించనున్నట్లు జిల్లా ఉపాధి కల్పన అధికారి షేక్ అబ్దుల్ సుభాన్ మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. తెలంగాణ ఓవర్సీస్ మ్యాన్‌పవర్ కంపెనీ లిమిటెడ్(టామ్‌కామ్) ఈ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు తెలిపారు. టామ్‌కామ్ గల్ఫ్ దేశాలతో పాటు ఆస్ట్రేలియా, కెనడా, జర్మనీ, హంగేరి, జపాన్, పోలాండ్, యుకే వంటి దేశాల్లో వివిధ ప్రైవేటు, ప్రభుత్వ నమోదిత ఏజెన్సీలతో భాగస్వామ్యాన్ని కుదుర్చుకుందని తెలిపారు. అభివృద్ధి చెందిన దేశాల్లో నర్సుల కు, కార్మికులకు అధిక డిమాండ్ ఉన్నట్లు తెలిపారు. టామ్‌కామ్ విదేశీ అవకాశాలపై అవగాహన కల్పించేందుకు 5న ఎన్‌రోల్‌మెంట్ డ్రైవ్‌ను నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఆసక్తి గల అభ్యర్థులు సంబంధిత ధ్రువపత్రాలతో ఐటీఐ కార్యాలయానికి రావాలని కోరారు. మరిన్ని వివరాల కోసం ఫోన్: 7893566493, 9849639539లలో సంప్రదించాలని ఆయన సూచించారు.

వైద్యశాఖలో కాంట్రాక్టు పద్ధతిన పోస్టుల భర్తీ నేడు

వికారాబాద్ అర్బన్: తాండూరులోని రాష్ట్రీయ బాల్ స్వాస్థ్య కార్యక్రమంలో భాగంగా కొత్తగా ఏర్పాటు చేసిన డీఈఐసీలో ఖాళీలను కాంట్రాక్టు పద్ధతిన భర్తీ చేయనున్నట్లు జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి పాల్వాన్ కుమార్ మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. వాక్ ఇన్ ఇంటర్వ్యూ ద్వారా ఈ నెల 4వ తేదీ ఉదయం 10గంటల నుంచి సాయంత్రం 4గంటల వరకు కలెక్టరేట్ సమావేశ మందిరంలో ఇంటర్వ్యూలు ఉంటాయని తెలిపారు. అర్హత గల అభ్యర్థులు అన్ని ఒరిజినల్ సర్టిఫికెట్లతో హాజరు కావాలని కోరారు. మార్గదర్శకాలు, విద్యార్హతలు దరఖాస్తు ఫారం కోసం జిల్లా అధికారి వెబ్‌సైట్‌లో చూడాలన్నారు.

కానుకలు రెడీ

బతుకమ్మ.. ఈ మాట వినగానే యావత్ తెలంగాణ మహిళా లోకం ఆనందంలో మునిగిపోతుంది.. పూల పండుగ వచ్చిందంటే బాలికలు మొదలుకొని యువతులు, మహిళలు కలసిమెలసి అందంగా బతుకమ్మలను పేర్చి లయబద్ధంగా ఆడి పాడతారు. ఈ వేడుకను కులమతాలకతీతంగా జరుపుకోవడం ఇక్కడ ఆనవాయితీ. ఈ పండుగను పురస్కరించుకొని ప్రభుత్వం తన వంతుగా బతుకమ్మ చీరలను పంపిణీ చేస్తోంది.

నేటి నుంచి బతుకమ్మ చీరల పంపిణీ

- ఏర్పాట్లు చేస్తున్న అధికారులు
- జిల్లాలో అర్హులైన మహిళలు 3,37,586
- అవసరమైన చీరలు 2,73,000
- ఇప్పటి వరకు వచ్చింది 1,62,145
- ఇంకా రావాల్సినవి 1,10,855



పంపిణీకి సిద్ధంగా ఉన్న బతుకమ్మ చీరలు

వికారాబాద్: రాష్ట్ర ప్రజలు ప్రతి ఏటా అంగరంగ వైభవంగా జరుపుకొనే పూల పండుగ బతుకమ్మ. ఈ వేడుకను పురస్కరించుకుని ప్రభుత్వం బతుకమ్మ చీరలను పంపిణీ చేస్తోంది. పండుగ సమీపిస్తున్న నేపథ్యంలో కానుకల పంపిణీకి అధికారులు ఏర్పాట్లు చేస్తున్నారు. త్వరలో ఎన్నికల కోడ్ రానుండడంతో ఈ సారి కాస్త ముందుగా చీరలు పంపిణీ చేసేందుకు ఏర్పాట్లు చేస్తున్నారు. ఈ శనివారం లేదా ఆదివారం నుంచి జిల్లా వ్యాప్తంగా కార్యక్రమం ప్రారంభించేందుకు అధికారులు సమాయత్తమవుతున్నారు. సిరిసిల్ల హస్తకళాకారుల చేతిలో రంగులు దిద్దుకున్న బతుకమ్మ చీరలు ఇప్పటికే జిల్లా కేంద్రానికి చేరాయి. ప్రస్తుతం ఆయా మండల కేంద్రాలు, గ్రామాలకు తరలిస్తున్నారు. చీరల పంపిణీ కోసం గ్రామానికి ముగ్గురు చొప్పున ప్రత్యేక బృందాలను ఏర్పాటు చేసినట్లు తెలిసింది. గ్రామాల వారీగా ఏర్పాటు చేసిన బృందాలతో పాటు స్థానిక రేషన్ డీలర్లు పంపిణీ ప్రక్రియలో కీలకంగా వ్యవహరించనున్నారు. అయితే గత అనుభవాలను దృష్టిలో ఉంచుకొని పంపిణీలో ఇబ్బందులు తలెత్తకుండా ఏర్పాట్లు చేస్తున్నట్లు సమాచారం.

అవసరం మేరకు..

జిల్లాలో రేషన్ కార్డుల లెక్కల ప్రకారం 3,37,586 మంది మహిళలు ఉన్నారు. వీరిలో చాలా మంది చీరలు తీసుకునేందుకు ముందుకు రాకపోవడంతో ప్రతిసారి మిగిలిపోతున్నాయి. గత గణాంకాలను పరిగణనలోకి తీసుకున్న అధికారులు 2,73,000 చీరలు అవసరమని గుర్తించారు. ఇప్పటికే 1,62,145 చీరలు జిల్లా కేంద్రానికి చేరాయి. మరో 1,10,855 చీరలు రావాల్సి ఉంది. రేషన్ కార్డులో పేరున్న ప్రతి మహిళకూ చీర ఇవ్వనున్నారు.

ఆత్మగౌరవమే లక్ష్యం



మహిళల ఆత్మగౌరవం పెంచడమే లక్ష్యంగా కేసీఆర్ ప్రభుత్వం పనిచేస్తోంది. ఇందులో భాగంగా మహిళల కోసం అనేక కార్యక్రమాలు చేపడుతోంది. తెలుగింటి ఆడపడుచులకు చీరల పంపిణీ కూడా ఇందులో భాగమే. ఎలాంటి తారతమ్యాలు లేకుండా 18ఏళ్లు నిండిన ప్రతి మహిళకు ప్రభుత్వం చీరను బతుకమ్మ కానుకగా ఇస్తుంది. ఈ కార్యక్రమంలో ఎలాంటి లోటుపాట్లు లేకుండా అధికారులు చూడాలి.

– మహేశ్‌రెడ్డి, ఎమ్మెల్యే

అన్ని ఏర్పాట్లు చేశాం



జిల్లాలో శనివారం నుంచి బతుకమ్మ చీరలు పంపిణీ చేయాలని నిర్ణయించాం. ఇందుకోసం అన్ని ఏర్పాట్లు చేశాం. ఎంపీడీఓలు, తహసీల్దార్లు మండలాల వారీగా పంపిణీ కార్యక్రమాన్ని పర్యవేక్షించాలని సూచించాం. ఇంకా 30శాతం చీరలు రావాల్సి ఉంది. వచ్చిన రెండు లక్షల పైచిలుకు చీరలను ముందుగా మండలాలకు అక్కడి నుంచి గ్రామాలకు చేరవేస్తున్నాం. ఎమ్మెల్యేలు, అధికారులు, స్థానిక ప్రజాప్రతినిధులు చీరల పంపిణీని ప్రారంభిస్తారు.

– కృష్ణన్, డీఆర్డీఓ, వికారాబాద్



క్రీడాకారులను పరిచయం చేసుకుంటున్న మంత్రి మహేందర్‌రెడ్డి

క్రీడలతో బంగారు భవిత

- మంత్రి పట్నం మహేందర్‌రెడ్డి
- ఎన్కేపల్లి మోడల్ స్కూల్‌లో వాలీబాల్ పోటీలు ప్రారంభం

పూడూరు: రాష్ట్రంలో ప్రతిభావంతులైన క్రీడాకారులకు ప్రభుత్వ ప్రోత్సాహం ఉంటుందని మంత్రి పట్నం మహేందర్‌రెడ్డి అన్నారు. మంగళవారం మండలంలోని ఎన్కేపల్లి మోడల్ స్కూల్‌లో 67వ జిల్లాస్థాయి బాల, బాలికల వాలీబాల్ పోటీలను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ప్రతి విద్యార్థి క్రీడల్లో రాణించాలని సూచించారు. దేశంలో ఎక్కడా లేని విధంగా తెలంగాణ ప్రభుత్వం క్రీడాకారులను ప్రోత్సహిస్తోందని తెలిపారు. అర్జున్ అవార్డు గ్రహీతలు రవికాంత్‌రెడ్డి, సుహాసిని రంగారెడ్డి, వికారాబాద్ జిల్లాలకు చెందిన వారే అన్నారు. అలాంటి వారిని స్ఫూర్తిగా తీసుకోవాలని సూచించారు. జిల్లాలోని 18 మండలాల నుంచి 24 టీంలు, అండర్- 14, అండర్- 17 విభాగాల్లో 320 మంది క్రీడాకారులు పాల్గొన్నారు. కార్యక్రమంలో ఎంఈఓ రేణుకాదేవి, సర్పంచ్ వనజ, ఎంపీటీసీ సురేందర్, మండల విద్యాధికారి హరీశ్చందర్, మోడల్ స్కూల్ ప్రిన్సిపాల్ శ్రీదేవి, విశ్రాంత డీఎస్పీ రాములు, వ్యాయామ ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

బీఆర్ఎస్‌ను గెలిపించాలి

దౌల్తాబాద్/కొడంగల్: నియోజకవర్గం అభివృద్ధి చెందాలంటే తిరిగి బీఆర్ఎస్ ప్రభుత్వాన్ని గెలిపించాలని మంత్రి మహేందర్‌రెడ్డి అన్నారు. మంగళవారం కొడంగల్ మండలం రుద్రారం, పాటిమీదిపల్లి, అన్నారం, నాగారం గ్రామాల్లో పర్యటించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. బీజేపీ, కాంగ్రెస్ పార్టీలు బీఆర్ఎస్‌పై బురదజల్లే ప్రయత్నాలు చేస్తున్నాయని ఆరోపించారు. ఈ పార్టీలు ప్రజలను తప్పుదోవ పట్టిస్తాయని, అలాంటి వారి మాటలు నమ్మవద్దని కోరారు. ప్రభుత్వం అమలు చేస్తున్న అభివృద్ధి, సంక్షేమ పథకాలకు ప్రజలు ఆకర్షితులు అవుతున్నారని పేర్కొన్నారు. అభివృద్ధికి ప్రాధాన్యత ఇచ్చే బీఆర్ఎస్‌కే పట్టం కట్టాలని కోరారు. ప్రభుత్వానికి ఆర్థిక భారమైనా రైతుల సంక్షేమం కోసం రైతు బీమా, రైతు బంధు, రుణమాఫీ వంటి పథకాలు అమలు చేసినట్లు పేర్కొన్నారు. అనంతరం ఎమ్మెల్యే నరేందర్‌రెడ్డి మాట్లాడుతూ.. రైతు సంక్షేమం కోసం సీఎం కేసీఆర్ ఎనలేని కృషి చేస్తున్నారని అన్నారు. తెలంగాణలో ప్రతి ఇంటికీ సంక్షేమ పథకాలు అందుతున్నాయని పేర్కొన్నారు. కార్యక్రమంలో పార్టీ మండల అధ్యక్షుడు దామోదర్‌రెడ్డి, సర్పంచ్ అనిత, కౌన్సిలర్ మధుయాదవ్, నాయకులు వెంకటలక్ష్మి, వెంకటయ్య గౌడ్ పాల్గొన్నారు.

స్టేడియం పనుల పరిశీలన

చేవెళ్ల: మండల కేంద్రంలో కొనసాగుతున్న స్టేడియం పనులను ఎంపీ డాక్టర్ జి. రంజిత్‌రెడ్డి మంగళవారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. నిరుపయోగంగా ఉన్న ఈ స్టేడియాన్ని అందుబాటులోకి తేవాలని స్థానికులు చేసిన విజ్ఞప్తి మేరకు సొంత నిధులు రూ.50 లక్షలు వెచ్చించి అభివృద్ధి చేస్తున్నట్లు చెప్పారు. పనులు దాదాపు పూర్తి కావచ్చాయని, ఈ నెల 6న ప్రారంభిస్తామని తెలిపారు. స్టేడియం అందుబాటులోకి వస్తే స్థానికులకు వాకింగ్, రన్నింగ్‌ట్రాక్‌లు, వాలీబాల్, క్రికెట్ తదితర స్పోర్ట్స్ ఆడుకునేందుకు వీలుగా ఉంటుందని చెప్పారు. అనంతరం ప్రభుత్వ డిగ్రీ కళాశాల భవన నిర్మాణ పనులను పరిశీలించారు.

'గులాబీ'లో అసమ్మతి సెగ

- మనోహర్‌రెడ్డికి టికెట్ రాకపోవడంతో ఇతర పార్టీల్లోకి అనుచర వర్గం
- ఇప్పటికే కాంగ్రెస్‌లో చేరిన దోమ ఎంపీపీ అనసూయ, ఎంపీటీసీ అనిత
- అదే బాటలో ద్వితీయ శ్రేణి నాయకులు

పరిగి: అసెంబ్లీ ఎన్నికలు సమీపిస్తున్న వేళ అధికార బీఆర్ఎస్‌లో అసమ్మతి పోరు ఎక్కువ అవుతోంది. గ్రామ, మండల, పట్టణ నాయకుల్లో ఐక్యత కొరవడుతోంది. ఇంతవరకు వర్గ పోరుతో ఉన్న పరిగి నియోజకవర్గం.. ఇటీవల ఎమ్మెల్యే టికెట్ల కేటాయింపుతో మరో వర్గం నాయకుల్లో చీలికలు ఏర్పడ్డాయి. ఇప్పటికే పలువురు కాంగ్రెస్ పార్టీలో చేరారు. వచ్చే ఎన్నికల వరకు ఎంత మంది పార్టీలో ఉంటారు, ఎంత మంది కారు దిగుతారోననే చర్చ జోరుగా సాగుతోంది. బీఆర్ఎస్ పరిగి ఎమ్మెల్యే టికెట్ ఆశించిన డీసీసీబీ చైర్మన్ మనోహర్‌రెడ్డికి అవకాశం దక్కలేదు. సిట్టింగ్ ఎమ్మెల్యే కొప్పుల మహేశ్‌రెడ్డికే అధిష్టానం టికెట్టు ఇచ్చింది. 2018 ఎన్నికల్లోనూ మనోహర్‌రెడ్డి టికెట్ ఆశించి రాకపోవడంతో మహేశ్‌రెడ్డికి మద్దతు తెలిపారు. తదనంతరం తమకే టికెట్టు వస్తుందని నియోజకవర్గంలో విస్తృతంగా ప్రచారం నిర్వహిస్తూ వచ్చారు. దీంతో బీఆర్ఎస్‌లో అంతర్గత పోరు ఏర్పడింది. అప్పటి నుంచి మనోహర్‌రెడ్డి పార్టీ, ప్రభుత్వ కార్యక్రమాలకు తప్ప ఎవ్వరితో కలవడం లేదు.

ఇతర పార్టీల్లోకి మనోహర్‌రెడ్డి వర్గం

బీఆర్ఎస్ టికెట్టుపై ఆశలు పెట్టుకున్న మనోహర్‌రెడ్డి మూడు సంవత్సరాలుగా నియోజవర్గంలో తన వర్గాన్ని పెంచుకుంటూ వచ్చారు. ఏడాది నుంచి నియోజకవర్గంలో విస్తృతంగా పర్యటించారు. తనకే ఎమ్మెల్యే టికెట్ వస్తుందని ప్రచారం చేసుకున్నారు. దీంతో ఆయా మండలాల నాయకులు, ప్రజాప్రతినిధులు ఆయన వెంట తిరిగారు. దీంతో ఎమ్మెల్యే కొప్పుల మహేశ్‌రెడ్డి, మనోహర్‌రెడ్డి మధ్య దూరం పెరిగింది. వీరు రెండు వర్గాలుగా చీలి, ఎవరి కార్యక్రమాలు వారు చేసుకుంటున్నారు. మనోహర్‌రెడ్డి వెంట తిరుగుతున్న ప్రజాప్రతినిధులు ఎమ్మెల్యేతో అంటి ముట్టనట్లుగా ఉంటున్నారు. ఒకానొక సమయంలో మనోహర్‌రెడ్డి తన వర్గంతో బాలాన్ని నిరూపించుకున్నారు. అయితే పరిగి బీఆర్ఎస్ సీటు మళ్లీ మహేశ్‌రెడ్డికే ఇవ్వడంతో మనోహర్‌రెడ్డి వర్గంలో చీలికలు ఏర్పడ్డాయి. ఎక్కువ శాతం ఇతర పార్టీలో చేరుతున్నారు. ఇటీవల దోమ ఎంపీపీ అనసూయ, ఎంపీటీసీ బంగ్ల అనితతో పాటు పలు గ్రామాల నాయకులు కాంగ్రెస్‌లో చేరారు. చాలా మంది సర్పంచులు వారితో పాటు చేరాల్సి ఉన్నా ఎమ్మెల్యే బుజ్జగింపులతో ఆగారనే ప్రచారం జరుగుతోంది. వారు కూడా కొద్ది రోజుల్లో పార్టీని వీడే అవకాశం కనిపిస్తోంది.

ద్వితీయ స్థాయిలో అసమ్మతి

బీఆర్ఎస్‌లోని ద్వితీయ శ్రేణి నాయకుల్లో అసమ్మతి నెలకొంది. దోమ ఎంపీపీ అనసూయ రెండు దశాబ్దాలుగా మహేశ్‌రెడ్డితో కలసి పనిచేశారు. ఇటీవల వరకు ఆయన వెంటే తిరిగారు. టికెట్టు రాకపోవడంతో అంటి ముట్టనట్లు ఉంటున్నారు. ఇప్పటికే ఎంపీపీ వర్గం కాంగ్రెస్ పార్టీలో చేరింది. అలాగే దోమ మండలంలో ఓ నాయకుడి పని తీరువల్ల చాలా మంది నాయకులు ఈ సారి బీఆర్ఎస్‌కు పని చేయరాదని నిర్ణయించుకున్నట్లు తెలిసింది. ఎన్నికల కోడ్ వచ్చేలోపు చాలా మంది బీఆర్ఎస్ వీడే అవకాశాలు కనిపిస్తున్నాయి. దోమ, పరిగి, పూడూర్, కుల్కచర్ల, చౌడాపూర్, గండీడ్, మహమ్మదాబాద్ మండలాల్లో కూడా అసమ్మతి పోరు ఎక్కువగానే ఉంది.

బీజేపీలో గ్రూపుల గోల

- ఎవరికి వారు విడిపోయి పార్టీ కార్యాలయాల ఏర్పాటు
- ప్రతి నియోజకవర్గంలోనూ ఇదే పరిస్థితి
- ఏసీఆర్ పార్టీ వీడటంతో మరింత బలహీనపడిన వైనం
- బలమైన నేతలు చేరుతారనే ఆశలు గల్లంతు
- నైరాశ్యంలో కమలం శ్రేణులు



వికారాబాద్: జిల్లాలో బీజేపీ పరిస్థితి నానాటికి తీసికట్టుగా మారుతోంది. అసెంబ్లీ ఎన్నికలు ముంచుకొస్తున్న వేళ పార్టీ బలపడుతుంది అనుకుంటే మరింత బలహీన పడుతోందనే సంకేతాలు కనిపిస్తున్నాయి. ఎన్నికలకు ఏడాది ఉండగా హడావుడి చేసిన ఆ పార్టీ శ్రేణులు ఎన్నికలు సమీపిస్తున్న వేళ సన్నద్ధతను పక్కన పెట్టి బేళ చూపులు చూస్తున్నారు. మరో పక్క బీజేపీకి జిల్లాలో ఉన్న ఒకే ఒక్క ముఖ్య నేత ఏసీఆర్ పార్టీ వీడడం పెద్ద దెబ్బే అని పలువురు అంటున్నారు. అయితే పార్టీ జిల్లా అధ్యక్షుడు నాయకులు, కార్యకర్తలను ఒక్కతాటిపైకి తీసుకురావడంలో పూర్తిగా విఫలమయ్యారని ఆరోపణలు ఉన్నాయి. అంతేకాకుండా గ్రూపులకు ఆజ్యం పోస్తున్నారని ఆ పార్టీ వర్గాలే పలు సందర్భాల్లో విమర్శలు గుప్పించాయి. జిల్లాలోని అన్ని నియోజకవర్గాల్లో గ్రూపు తగాదాలు కనిపిస్తున్నాయి. కొన్ని నియోజకవర్గాల్లో ఎవరికి వారు విడిపోయి పార్టీ కార్యాలయాలు ఏర్పాటు చేసుకోవడం చూస్తే గ్రూపు రాజకీయాలో ఏ స్థాయిలో ఉన్నాయో ఇట్టే తెలిసిపోతుంది.

ఆశావహులు అధికం

జిల్లాలో బీజేపీ నుంచి ఎమ్మెల్యే టికెట్లు ఆశిస్తున్న వారు పదుల సంఖ్యలో ఉన్నారు. ఒక్కమాటలో చెప్పాలంటే ఆయా నియోజకవర్గాల నుంచి ఊహించని రీతిలో దరఖాస్తులు వెల్లువెత్తాయి. అధికార బీఆర్ఎస్, ప్రతిపక్ష కాంగ్రెస్ పార్టీల కంటే కూడా బీజేపీలో ఎక్కువ మంది తమకు ఎమ్మెల్యే టికెట్ కావాలంటూ దరఖాస్తులు చేశారు. ఇందులో స్థానికులు, స్థానికేతరులు ఉన్నారు. జిల్లాలోని నాలుగు నియోజకవర్గాల నుంచి ఏకంగా 48 మంది ఎమ్మెల్యే టికెట్ల కోసం దరఖాస్తు చేయడం గమనార్హం.

ఎవరి ప్రయత్నాలు వారివి..

వికారాబాద్ నియోజకవర్గం నుంచి పీ నవీన్‌కుమార్, లక్ష్మయ్య, జైపాల్, సత్తయ్య, సహదేవ్, క్రాంతి దరఖాస్తు చేసుకున్నారు. పరిగి నియోజకవర్గం నుంచి పరమేశ్వర్‌రెడ్డి, బూనేటి మారుతి కిరణ్, గనాపురం వెంకటయ్య, గిరమోని శ్రీనివాస్, మల్లేశ్ ముదిరాజ్, రాముయాదవ్, ఏపీ రాములు దరఖాస్తు చేశారు. తాండూరు నుంచి యూ రమేశ్, లక్ష్మారెడ్డి, సుదర్శన్‌గౌడ్, మురళీ కృష్ణగౌడ్, నరేశ్ మహరాజ్, శ్రీలత, పటేల్ జయశ్రీ, పటేల్ రవిశంకర్ దరఖాస్తు చేసుకున్నారు. కొడంగల్ నుంచి పూనం చంద్‌లవూరీ, డాక్టర్ బాలవర్ధన్, బంటు రమేశ్, కూర వెంకటేశ్, బాబయ్య నాయుడు పోటీలో ఉన్నారు. వీరితో పాటు మరి కొందరు కార్యకర్తలు తమ పేర్లను పరిశీలించాలని కోరుతున్నట్లు తెలుస్తోంది. అయితే జిల్లాకు చెందిన ఆ పార్టీ సీనియర్ నాయకులు కరణం ప్రహల్లాద్‌రావ్, సదానంద్‌రెడ్డి దరఖాస్తు చేయలేదు. ఎంపీ టికెట్ ఆశిస్తున్న వారు కూడా ముందుగా వచ్చే అసెంబ్లీ ఎన్నికల్లో పోటీ చేయాలనే ఆలోచనలో ఉన్నట్లు తెలుస్తోంది.

మౌలిక వసతుల కల్పనకు కృషి

- మంత్రి సబితారెడ్డి

తుక్కుగూడ: ప్రభుత్వ పాఠశాలల్లో మౌలిక వసతుల కల్పనకు ప్రభుత్వం మన ఊరు–మన బడి కార్యక్రమాన్ని చేపట్టిందని విద్యాశాఖ మంత్రి పి.సబితారెడ్డి పేర్కొన్నారు. మున్సిపల్ పరిధిలోని మంఖాల్ జిల్లా పరిషత్, ప్రాథమిక పాఠశాల్లో చేపట్టిన అభివృద్ధి పనులను మంగళవారం ఆమె ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. ఈ కార్యక్రమం ద్వారా రాష్ట్రంలో ప్రభుత్వ పాఠశాలల రూపురేఖలు పూర్తిగా మారిపోతాయన్నారు. ఇప్పటికే విద్యార్థులకు మధ్యాహ్న భోజనం, పౌష్టికాహారం కోసం రాగిజావను అందజేస్తున్నట్లు తెలిపారు. త్వరలో సీఎం కేసీఆర్ చేతులు మీదుగా అల్పాహార పథకం ప్రారంభం కానుందని చెప్పారు. కార్యక్రమంలో మున్సిపల్ వైస్ చైర్మన్ బి.వెంకట్‌రెడ్డి, కమిషనర్ బి.వెంకట్రాం, డీఈఈ యాదయ్య, పార్టీ మున్సిపల్ అధ్యక్షుడు లక్ష్మయ్య యాదవ్, కౌన్సిలర్లు, పాఠశాల సిబ్బంది, బీఆర్ఎస్ నాయకులు పాల్గొన్నారు.

రావిర్యాల స్కూల్‌ను పరిశీలించిన మంత్రి

మున్సిపల్ పరిధిలోని రావిర్యాల ప్రభుత్వ పాఠశాలలో ఈ నెల 6న అల్పాహార పథకాన్ని ముఖ్యమంత్రి కేసీఆర్ ప్రారంభించే అవకాశం ఉందన్న నేపథ్యంలో మంగళవారం విద్యాశాఖ మంత్రి పి.సబితారెడ్డి స్కూలును సందర్శించారు. విద్యార్థులు, ఉపాధ్యాయులను కలిసి వారి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. మన ఊరు–మన బడి పనుల గురించి ఆరా తీశారు. మంత్రి వెంట విద్యాశాఖ డైరెక్టర్ దేవసేన, డీఈఓ సుశీందర్‌రావు, ఏఈఓ కృష్ణయ్య, మున్సిపల్ కమిషనర్ బి.వెంకట్రామ్, డీఈఈ యాదయ్య, ఏఈ కె.భార్గవ్ రెడ్డి, బీఆర్ఎస్ మున్సిపల్ అధ్యక్షుడు లక్ష్మయ్య తదితరులు ఉన్నారు. మరోవైపు రావిర్యాలకు సీఎం రానున్నారన్న సమాచారంతో పాఠశాల ప్రాంగణంలో ఏర్పాట్లతోపాటు, రోడ్లకు ఆయా శాఖల అధికారులు మరమ్మతులు చేస్తున్నారు. అధికారులు, రాజకీయ నాయకుల పర్యటనలతో హడావుడి నెలకొంది.

హరీశ్వర్‌రెడ్డి సేవలు చిరస్మరణీయం

- మంత్రులు సబితారెడ్డి, మహేందర్‌రెడ్డి

పరిగి: దివంగత నేత, ఉమ్మడి రాష్ట్రం మాజీ డిప్యూటీ స్పీకర్ కొప్పుల హరీశ్వర్‌రెడ్డి పరిగికి చేసిన సేవలు ప్రజల్లో చిరస్థాయిగా నిలిచిపోతాయని మంత్రులు సబితారెడ్డి, పట్నం మహేందర్‌రెడ్డి అన్నారు. మంగళవారం హరీశ్వర్‌రెడ్డి ద్వాదశ దినకర్మ సందర్భంగా ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం వారు మాట్లాడుతూ.. హరీశ్వర్‌రెడ్డి మృతి బీఆర్ఎస్ పార్టీకి తీరని లోటన్నారు. ప్రత్యేక రాష్ట్రం కోసం తన పదవిని సైతం లెక్క చేయలేదన్నారు. కార్యక్రమంలో మంత్రి ఎర్రబెల్లి దయాకర్, ఎంపీలు రంజిత్‌రెడ్డి, బీబీ పాటిల్, ఎమ్మెల్యేలు మహేశ్‌రెడ్డి, యాదయ్య, ఆనంద్, నరేందర్‌రెడ్డి, గోపీనాథ్, అంజయ్య యాదవ్, జైపాల్ యాదవ్, సుధీర్‌రెడ్డి, ఎమ్మెల్సీ గోరేటి వెంకన్న, మాజీ మంత్రి నాగం జనార్దన్‌రెడ్డి, కలెక్టర్ నారాయణరెడ్డి, ఎస్పీ కోటిరెడ్డి, బీసీ కమిషన్ మెంబర్ శుభప్రద్‌పటేల్ పాల్గొన్నారు.



హరీశ్వర్‌రెడ్డి చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న మంత్రులు మహేందర్‌రెడ్డి, సబితారెడ్డి, ఎంపీ రంజిత్‌రెడ్డి, ఎమ్మెల్యే ఆనంద్

క్లుప్తంగా

దోమ కేజీబీవీ వద్ద ఎన్ఎస్‌యూఐ నిరసన

దోమ: కేజీబీవీ విద్యార్థులకు సరైన భోజనం అందించడం లేదని ఎన్ఎస్‌యూఐ జిల్లా ఉపాధ్యక్షుడు సైఫ్‌ఖాన్ ఆరోపించారు. బుధవారం దోమలోని కస్తూర్బా పాఠశాలను సందర్శించి మధ్యాహ్న భోజనాన్ని పరిశీలించేందుకు ప్రయత్నించగా ఎస్‌ఓ పద్మజ లోనికి అనుమతించలేదన్నారు. దీంతో గేటు వద్దే నిరసన వ్యక్తంచేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. హాస్టల్‌లోని విద్యార్థులకు ఉడకని అన్నం, నీళ్లచారు వడ్డిస్తున్నారని, మెనూ పాటించడం లేదని తెలిపారు. ఈ విషయాన్ని విద్యార్థుల తల్లిదండ్రులు తమకు చెప్పడంతో పరిశీలనకు వెళ్లగా.. అనుమతి లేదని తప్పించుకుంటున్నారని మండిపడ్డారు. ఈ విషయమై ఎస్‌ఓ పద్మజను అడగగా.. తాము మెనూ పాటిస్తున్నామని, ఎవరైనా సరే ఉన్నతాధికారుల నుంచి అనుమతులు పొందితేనే లోనికి అనుమతిస్తామని తెలిపారు.

'కళింగ' చిత్రంలో ఒగ్గు కళాకారులు



షూటింగ్‌లో ఒగ్గు కళాకారులు

బొంరాస్‌పేట: సినిమాలో నటించే అవకాశం మండల పరిధి నాందార్‌పూర్ మల్లికార్జున ఒగ్గు కళాసేవా సమితి కళాకారులకు దక్కింది. దీంతో ఆ బృందం వ్యవస్థాపక అధ్యక్షుడు ఒగ్గు బీరు మంగళవారం హర్షం వ్యక్తంచేశారు. కడప జిల్లా గండికోటలో చిత్రీకరణ జరుగుతోందని, బలగం సినిమా కొమురయ్య పాత్రధారితో కలిసి షూటింగ్ పాల్గొన్నామని చెప్పారు. ఈ షూటింగ్‌లో కళాకారులు శివ, మల్లేశ్, రాఘవేందర్, భద్రయ్య, నరసింహ, మహేందర్, రాకేశ్, నవీన్, మనోజ్ ఉన్నారని తెలిపారు.

'అంబేడ్కర్' అవార్డుకు యాదయ్య ఎంపిక



ఆహ్వాన పత్రాన్ని అందజేస్తున్న సంస్థ ప్రతినిధులు

పరిగి: అంబేడ్కర్ జాతీయ అవార్డుకు వైఎస్ఆర్‌సీపీ జిల్లా అధ్యక్షుడు కొల్ల యాదయ్య ఎంపిక అయినట్లు సంస్థ ప్రతినిధులు ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఈ మేరకు మంగళవారం బహుజన సాహిత్య జాతీయ అకాడమీ అధ్యక్షుడు రాధాకృష్ణ.. యాదయ్యకు ఆహ్వాన పత్రిక అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. వెనుకబడిన వారి అభ్యున్నతికి బహుజన సాహిత్య అకాడమీ బాసటగా నిలిచి, వారి ప్రతిభను గుర్తిస్తుందని చెప్పారు. ఈ నెల 15న ఢిల్లీలో ఈ అవార్డును ప్రదానం చేయనున్నట్లు పేర్కొన్నారు. ఇందులో జిల్లా నాయకులు శ్రీనివాస్, వెంకటయ్య పాల్గొన్నారు.

కల్తీ మద్యం విక్రయిస్తే కేసులు పెట్టండి

జెడ్పీ చైర్‌పర్సన్ అనితారెడ్డి

తుర్కయంజాల్: కల్తీ మద్యం విక్రయించే వారిపై కేసులు నమోదు చేసి చట్టరీత్యా చర్యలు తీసుకోవాలని జిల్లా పరిషత్ చైర్‌పర్సన్ తీగల అనితారెడ్డి ఆదేశించారు. జెడ్పీ కార్యాలయంలో మంగళవారం నిర్వహించిన స్థాయీ సంఘాల సమావేశంలో ఆమె మాట్లాడుతూ.. అక్రమ మైనింగ్‌ను అరికట్టాలని, ఫిట్‌నెస్ లేని వాహనాలను సీజ్ చేయాలని, ఆర్టీసీ బస్సులు సమయ పాలన పాటించేలా చూడాలని, మండలాల్లో నిర్వహించే జనరల్ బాడీ మీటింగ్‌లకు అన్ని శాఖల అధికారులు హాజరు కావాలని సూచించారు. పరిశ్రమల శాఖ ద్వారా అందిస్తున్న సబ్సిడీ పథకాలను సద్వినియోగం చేసుకోవాలన్నారు. ప్రభుత్వ పాఠశాలలను ఆదర్శవంతంగా తీర్చిదిద్దుతున్నామని, ప్రభుత్వ ఆస్పత్రుల్లో కాన్పుల సంఖ్య పెరిగిందని గుర్తుచేశారు. ఈ కార్యక్రమంలో జెడ్పీటీసీలు వెంకట్‌రామ్ రెడ్డి, శ్రీలత, దశరథనాయక్, కో ఆప్షన్ సభ్యులు అలీ అక్బర్ ఖాన్, జెడ్పీ సీఈఓ దిలీప్ కుమార్, డిప్యూటీ సీఈఓ రంగారావు తదితరులు పాల్గొన్నారు.

పరిమితి పెంచారు.. మిత్తీ మరిచారు!



మోమిన్‌పేటలో మహిళా సమాఖ్య సమావేశం

- నాలుగున్నరేళ్లుగా వడ్డీ చెల్లించని సర్కారు
- పెదవి విరుస్తున్న డ్వాక్రా మహిళలు
- బ్యాంకులకు వడ్డీ కడుతున్న సభ్యులు

మోమిన్‌పేట: 'డ్వాక్రా మహిళలు బ్యాంకుల నుంచి తీసుకున్న రుణాలకు ప్రభుత్వమే వడ్డీ చెల్లిస్తుంది. మిత్తిలేని రుణాలను అందించి వారి ఆర్థికాభివృద్ధికి తోడ్పాటు నందించడమే ప్రభుత్వ లక్ష్యం' అని చెప్పి నాలుగున్నరేళ్లు గడుస్తున్నప్పటికీ.. నేటికీ అతీగతి లేదని సభ్యులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. తీసుకున్న రుణానికి యేటా వడ్డీలు కట్టాల్సి వస్తుందని వాపోతున్నారు. 'తీసుకున్న అప్పుకు ప్రస్తుతం మీరు వడ్డీ కట్టండి. ప్రభుత్వం చెల్లించిన పిదప మీమీ ఖాతాలో జమ చేస్తాం' అని బ్యాంకు అధికారులు చెబుతూ.. మా వద్ద వడ్డీ వసూలు చేస్తున్నారని ఆరోపిస్తున్నారు. ప్రభుత్వం మిత్తి సకాలంలో చెల్లిస్తే తమకు న్యాయం జరుగుతుందని, ఏళ్లుగా పేరుకుపోయిన తర్వాత ఇస్తే ప్రయోజనం ఏముంటుందని మహిళా సంఘాలు ప్రశ్నిస్తున్నాయి.

సర్కారు చెల్లించాల్సిన వడ్డీ రూ.92కోట్లు

రుణ పరిమితి సంఘానికి రూ.5లక్షల నుంచి రూ.20లక్షల వరకు పెంచారు. కానీ నాలుగున్నరేళ్లుగా వడ్డీలు చెల్లించడం లేదని, జిల్లాలోని 19 మండలాల్లో 2019–20 నుంచి ఇప్పటి వరకు ప్రభుత్వం ఇవ్వాల్సిన వడ్డీ రూ.92కోట్లకు పైగానే ఉందని సభ్యులు పేర్కొంటున్నారు. మోమిన్‌పేట మండల పరిధి గ్రామాల్లో 838 డ్వాక్రా సంఘాలకు ప్రభుత్వం అందించాల్సిన బకాయి నాలుగున్నరేళ్లుగా చెల్లించక పోవడంతో రూ.9.50కోట్లకు పేరుకు పోయిందని మహిళలు ఆగ్రహం వ్యక్తంచేస్తున్నారు. వడ్డీ లేని రుణాలు అందిస్తామని చెప్పిన ప్రభుత్వం.. బ్యాంకు రుణాలు, స్త్రీనిధి నుంచి తీసుకున్న రుణాలపై వడ్డీలు తామే చెల్లిస్తున్నామని మహిళలు చెప్పారు.

తీసుకున్న రుణాలు

2019–20లో 477 మహిళా సంఘాలు రూ.13.67కోట్ల రుణం తీసుకున్నాయి. 2020–21లో 735 సంఘాలు రూ.20.15కోట్లు తీసుకోగా.. 2021–22లో 706 సంఘాలు 38.34కోట్లు, 2022–23లో 371 సంఘాలు 26.72కోట్ల రుణం తీసుకున్నాయి.

రావాల్సిన వడ్డీ..

2019–20 వడ్డీలేని రుణం తీసుకున్న సంఘాలు 749. వారికి రావాల్సిన వడ్డీ రూ.2.05కోట్లు. 2020–21లో 796 సంఘాలకు గాను రూ.1.76కోట్లు, 2021–22లో 747 సంఘాలకు 2.07కోట్లు, 2022–23లో 810 సంఘాలకు రూ.3.06కోట్ల వడ్డీ ప్రభుత్వం అందించాల్సి ఉంది. దీంతో పలువురు మహిళలు మాట్లాడుతూ ఇలా రుణ పరిమితి పెంచి, రుణాలు ఇచ్చిన ప్రభుత్వం.. వడ్డీ చెల్లించడం మరిచిందని, ఎప్పటికప్పుడు మహిళా సంఘాలకు చెల్లించాలని కోరుతున్నారు.

రుణ ఖాతాలో జమ..



ప్రభుత్వం చెల్లించే వడ్డీ.. డ్వాక్రా సంఘాల రుణ ఖాతాలో జమ చేస్తారు. నేరుగా బ్యాంకులకు ప్రభుత్వం అందిస్తుంది. పూర్తిగా ఆన్‌లైన్ చేయడం ద్వారా ఎప్పటికప్పుడు సంఘాల పని తీరు, రుణాలను తిరిగి చెల్లించడం తెలిసిపోతుంది. నాలుగున్నరేళ్లుగా బకాయి పేరుకుపోయింది.

– రాజు, ఏపీఎం, మోమిన్‌పేట

రేపు మంత్రి కేటీఆర్ బహిరంగ సభ



సభ ఏర్పాట్లను పరిశీలిస్తున్న ఎమ్మెల్యే ఆనంద్

ఏర్పాట్లను పరిశీలించిన ఎమ్మెల్యే ఆనంద్

అనంతగిరి: కేటీఆర్ బహిరంగ సభను విజయవంతం చేయాలని ఎమ్మెల్యే ఆనంద్ కోరారు. వికారాబాద్ బ్లాక్ గ్రౌండ్‌లో గురువారం జరిగే సభ ఏర్పాట్లను ఆయన మంగళవారం పరిశీలించారు. అనంతరం మాట్లాడారు. మంత్రి కేటీఆర్.. రూ.180 కోట్లతో కూడిన పలు అభివృద్ధి కార్యక్రమాలకు శంకుస్థాపనలు, ప్రారంభోత్సవాలు చేయనున్నారని తెలిపారు. సభకు మంత్రులు, ఎమ్మెల్యేలు, ప్రజా ప్రతినిధులు రానున్నారని చెప్పారు. కావున బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు పెద్ద ఎత్తున తరలి రావాలని పిలుపునిచ్చారు. పీఏసీఎస్ చైర్మన్ ముత్యంరెడ్డి, పార్టీ పట్టణ అధ్యక్షుడు ప్రభాకర్ రెడ్డి, సీనియర్ నాయకులు లంక లక్ష్మీకాంత్ రెడ్డి, రమేష్ గౌడ్, విజయ్ కుమార్, రాజ మల్లయ్య, బుచ్చిబాబు గౌడ్, గయాజ్, వేణుగోపాల్, కౌన్సిలర్లు అనంతరెడ్డి ఉన్నారు.

బీఎస్పీ తాండూరు అభ్యర్థిగా చంద్రశేఖర్

తాండూరు టౌన్: బహుజన సమాజ్ పార్టీ (బీఎస్పీ) తాండూరు అసెంబ్లీ ఎమ్మెల్యే అభ్యర్థిగా బోయిని చంద్రశేఖర్ ముదిరాజ్‌ను ప్రకటించారు. ఈ మేరకు మంగళవారం పార్టీ ఇన్‌చార్జి, ఎంపీ రాంజీ గౌతమ్, రాష్ట్ర అధ్యక్షుడు డాక్టర్ ఆర్ఎస్ ప్రవీణ్ కుమార్‌లు 20 మందితో కూడిన తొలి జాబితాను హైదరాబాద్‌లో విడుదల చేశారు. ఇందులో తాండూరు అభ్యర్థిగా చంద్రశేఖర్‌కు అవకాశం కల్పించారు. ఈ సందర్భంగా చంద్రశేఖర్ మాట్లాడుతూ బహుజనులకు రాజ్యాధికారం దక్కడమే బీఎస్పీ ప్రధాన లక్ష్యమన్నారు. తనపై నమ్మకంతో పార్టీ అధినేతలు అభ్యర్థిగా ప్రకటించడం పట్ల వారికి కృతజ్ఞతలు తెలుపుతున్నట్లు చెప్పారు.



ప్రవీణ్‌కుమార్‌కు పుష్పగుచ్ఛం అందజేస్తున్న చంద్రశేఖర్ ముదిరాజ్

విద్యుదాఘాతంతో ఆవు మృతి



ధారూరు: ఆవు కళేబరం వద్ద రైతు

ధారూరు: వ్యవసాయ పొలంలో మేతమేస్తూ విద్యుదాఘాతానికి గురై ఆవు మృత్యువాత పడిన సంఘటన మంగళవారం జరిగింది. వివరాలు ఇలా ఉన్నాయి. ధారూరు మండలం గురుదోట్ల గ్రామ అనుబంధ ఊరెంటతండాకు చెందిన రైతు శ్యామ్‌లాల్ తన పాడి ఆవును మేపడానికి పొలానికి తీసుకెళ్లాడు. పొలంలో మేత మేస్తున్న క్రమంలో ట్రాన్స్‌ఫార్మర్ వద్ద ఏర్పాటు చేసిన అర్తింగ్ వైర్‌ను తొక్కింది. దీంతో విద్యుదాఘాతానికి గురై ఆవు మృతి చెందింది. పాడి పశువుపైనే ఆధార పడి జీవిస్తున్నానని, అది చనిపోవడంతో తనకు జీవనోపాధి లేకుండా పోయిందని రైతు వాపోయాడు. దాని ఖరీదు రూ.80వేలు ఉందని, ప్రభుత్వం ఆదుకోవాలని కోరాడు.

పూడూరులో..

పూడూరు: విద్యుదాఘాతంతో ఎద్దు మృతి చెందిన సంఘటన పూడూరు మండలం రేగడిమామిడిపల్లిలో మంగళవారం జరిగింది. బాధిత రైతు షరీఫ్ తెలిపిన వివరాల ప్రకారం.. వ్యవసాయ పొలం వద్ద ఉన్న ట్రాన్స్‌ఫార్మర్ వద్ద ఎద్దు మేత మేస్తుండగా.. కరెంట్ షాక్‌తో మృతి చెందిందని తెలిపారు. ఎద్దు విలువ రూ.60 వేల వరకు ఉంటుందని, ప్రభుత్వం ఆదుకోవాలని రైతు కోరాడు.

నిరాదరణకు గురవుతున్న వయోవృద్ధులు

- వారి సంరక్షణ పిల్లలదే
- బాధితులకు అండగా ఉంటాం
- స్పెషల్ సెకండ్ క్లాస్ మేజిస్ట్రేట్ నామాల అశోక్

అనంతగిరి: నిరాదరణకు గురవుతున్న వృద్ధ తల్లిదండ్రులకు జిల్లా న్యాయ సేవ అధికార సంస్థ అండగా ఉండి, న్యాయసలహాలు అవసరం ఉన్నవారికి ఉచితంగా న్యాయవాదులను ఏర్పాటు చేస్తుందని స్పెషల్ సెకండ్ క్లాస్ మేజిస్ట్రేట్ నామాల అశోక్ తెలిపారు. మంగళవారం వికారాబాద్ పట్టణం సత్య సాయి జ్ఞాన కేంద్రంలో సంస్థ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన న్యాయ అవగాహన సదస్సులో ఆయన పాల్గొని మాట్లాడారు. వృద్ధాప్యంలో ఎందరో తల్లిదండ్రులు తమ పిల్లలకు ఆస్తులు రాసిచ్చి, అనాథగా మారుతున్నారని, ఈ దుస్థితి ఎవరికి రాకుండా ఉండాలంటే ఆస్తులను తమ వద్దే ఉంచుకోవాలని చెప్పారు. పిల్లలు, వారి పోషణ సంరక్షణను చూడకపోతే వారు తగిన న్యాయ సలహాలు పొందటానికి న్యాయ సేవా అధికార సంస్థను సంప్రదించాలని సూచించారు. తల్లిదండ్రులను తాము సరిగ్గా చూసుకుంటే భవిష్యత్తులో వారి పిల్లలు అదే బాటలో నడుస్తారని, ఇది నేటి యువత గుర్తించాలన్నారు. భార్య పిల్లలను పోషించే బాధ్యత భర్తదేనన్నారు. మహిళలు, పిల్లలను వేధింపులకు గురిచేస్తే వారు భయపడాల్సిన అవసరం లేదని, వారి రక్షణ కోసం గృహహింస నిరోధక చట్టం ఏర్పాటు చేశామని వెల్లడించారు. సమావేశంలో సంస్థ చీఫ్ లీగల్ డిఫెన్స్ న్యాయవాది వెంకటేశ్, సీనియర్ సిటీజన్స్ జిల్లా అధ్యక్షుడు మాణిక్ ప్రభు తదితరులు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న మేజిస్ట్రేట్

స్థానికులకు ఇవ్వకపోవడం సిగ్గుచేటు

- 1,512 ఇళ్లలో స్థానికులకు 151.. స్థానికేతరులకు 1,361
- బీజేపీ జిల్లా అధికార ప్రతినిధి రవి

శంకర్‌పల్లి: నూతనంగా నిర్మించిన డబుల్ బెడ్రూం ఇళ్లను స్థానికులకే కేటాయించాలని బీజేపీ జిల్లా అధికార ప్రతినిధి తొండ రవి, చేవెళ్ల అసెంబ్లీ కన్వీనర్ ప్రతాప్‌రెడ్డి, సీనియర్ నాయకుడు ప్రభాకర్ రెడ్డి డిమాండ్ చేశారు. మంగళవారం స్థానిక ఆర్ అండ్‌బీ అతిథిగృహంలో వారు విలేకరుల సమావేశం ఏర్పాటు చేసి మాట్లాడారు. శంకర్‌పల్లిలో నిర్మించిన 1,512 డబుల్ బెడ్రూం ఇళ్లలో 1,361 ఇళ్లను నగరంలోని యాకుత్‌పురా, కార్వాన్ ప్రాంతవాసులకు కేటాయించడం సరికాదన్నారు. స్థానికులకు కేవలం 151 ఇళ్లను కేటాయించడం సిగ్గుచేటన్నారు. మాయ మాటలు చెప్పి ఓట్లేయించుకున్న స్థానిక నాయకులు ప్రజలకు సమాధానం చెప్పాలని డిమాండ్ చేశారు. స్థానికులకు ఇళ్లు ఇప్పించని నాయకులకు పదవులు ఎందుకని.. వెంటనే రాజీనామా చేసి పేద ప్రజల పక్షాన నిలవాలని అన్నారు. బుధవారం నుంచి ఇళ్ల కేటాయింపుపై ధర్నా చేపడతామని ధర్నా చేపడతామని.. రాజకీయాలకు అతీతంగా ప్రతీ ఒక్కరు ముందుకు రావాలని కోరారు. ఈ కార్యక్రమంలో బీజేపీ మున్సిపల్ అధ్యక్షుడు బీర్ల సురేశ్, మాజీ అధ్యక్షుడు జైరాంరెడ్డి, పార్టీ మండల ఉపాధ్యక్షుడు ప్రభాకర్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

బాలిక అదృశ్యం



జోయా బేగం(ఫైల్)

పహాడీషరీఫ్: బాలిక అదృశ్యమైన ఘటన పహాడీషరీఫ్ పోలీస్ స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. మంగళవారం పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. వాదే ముస్తఫా ప్రాంతానికి చెందిన మహ్మద్ నవాజ్ కుమార్తె జోయా బేగం(14) ఈ నెల 2వ తేదీన ఉ. 6 గంటలకు ఇంట్లో ఎవరికి చెప్పకుండా బట్టలు తీసుకొని వెళ్లిపోయింది. కుటుంబ సభ్యులు ఆమె ఆచూకీ కోసం అన్ని ప్రాంతాల్లో వెతికినా ప్రయోజనం లేదు. బాలిక తల్లి అజ్రాబేగం ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు. ఆచూకీ తెలిసిన వారు 87126 62367 నంబర్‌కు సమాచారం ఇవ్వాలన్నారు.

రాష్ట్రంలో భూముల రీసర్వే చేపట్టాలి



సమావేశంలో మాట్లాడుతున్న గజేందర్‌గౌడ్

భారతీయ కిసాన్ సంఘ్ జిల్లా అధ్యక్షుడు గజేందర్‌గౌడ్

షాబాద్: రాష్ట్రంలో భూములను రీసర్వే చేయిస్తామన్న హామీని ప్రభుత్వం వెంటనే అమలు చేయాలని భారతీయ కిసాన్ సంఘ్ జిల్లా అధ్యక్షుడు గడిగె గజేందర్‌గౌడ్ డిమాండ్ చేశారు. మంగళవారం నిర్వహించిన మండలస్థాయి సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. 2014 ఎన్నికల్లో ఇచ్చిన హామీ మేరకు ప్రభుత్వం వెంటనే భూముల రీసర్వేకు ఆదేశించాలన్నారు. సాక్షాత్తు అసెంబ్లీలో సీఎం ప్రకటన చేసినట్లు గుర్తు చేశారు. కమతాల ఏకీకరణ చేసేందుకు చర్యలు తీసుకోవాలని కోరారు. ప్రధాన రహదారుల వెంబడి భూములు కొన్ని రియాల్టర్లు ఆ వెనుక ఉన్న భూములకు చిన్న సన్న కారు రైతులు వెళ్లేందుకు వీలు లేకుండా కంచెల నిర్మాణం చేపట్టారని దీంతో రైతులకు దారులు లేక ఇబ్బందులు పడుతున్నారని తెలిపారు. రానున్న ఎన్నికల్లో రైతుల పక్షాన నిలబడే పార్టీకే రైతాంగం ఓట్లు వేస్తారన్నారు. రైతు రుణమాఫీ పథకంలో ఏర్పడ్డ చిక్కులను పరిష్కరిస్తున్నట్లు వ్యవసాయ అధికారి వెంకటేశం తెలిపారు. మండల పరిధిలోని మూడు స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా శాఖల నుంచి సమాచారం సేకరించి విశ్లేషిస్తున్నామన్నారు. కార్యక్రమంలో జిల్లా కార్యవర్గ సభ్యులు సత్యనారాయణరెడ్డి, పెంటయ్య, మండల అధ్యక్షుడు యాదవరెడ్డి, మండల కార్యవర్గ సభ్యులు చంద్రబాబు, వీరేశం, ఆయా గ్రామ కమిటీ అధ్యక్ష, కార్యదర్శులు, రైతులు తదితరులున్నారు.

గంజాయి రవాణా చేస్తున్న వ్యక్తి అరెస్టు

పహాడీషరీఫ్: గంజాయి రవాణా చేస్తున్న వ్యక్తిని బాలాపూర్ పోలీసులు అరెస్ట్ చేశారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం తూర్పు గోదావరి జిల్లాకు చెందిన కురసం రాజేష్ దొర(23)గత కొన్ని రోజులుగా ఆంధ్రప్రదేశ్ సీలేర్ నుంచి గంజాయి తీసుకొచ్చి హైదరాబాద్‌లో విక్రయిస్తున్నాడు. ఈ క్రమంలో మంగళవారం బాలాపూర్ శివాజీ చౌక్ వద్ద గంజాయి విక్రయిస్తున్నాడన్న విశ్వసనీయ సమాచారం మేరకు ఎల్‌బీనగర్ ఎస్‌ఓటీ రాజేష్‌ను అదుపులోకి తీసుకున్నారు. అతని వద్ద నుంచి పది కిలోల గంజాయి, రెండు సెల్‌ఫోన్లను స్వాధీనం చేసుకున్నారు. అనంతరం నిందితుడిని బాలాపూర్ పోలీసులకు అప్పగించారు.

రెండు తలల పాము కలకలం



రెండు తలల పాము

ఇబ్రహీంపట్నం: రెండు తలల పాము కలకలం రేపిన ఘటన ఇబ్రహీంపట్నం ఎంపీడీఓ కార్యాలయ క్వార్టర్స్‌లో చోటు చేసుకుంది. కార్యాలయ క్వార్టర్స్ బయట సోమవారం రాత్రి 11 గంటల సమయంలో పాము కనిపించడంతో అందులో నివాసముండే వారు ఆందోళనకు గురయ్యారు. ఫారెస్టు అధికారులకు సమాచారం ఇవ్వడంతో సిబ్బంది వచ్చి రెండు తలల పాముగా నిర్ధారించి పామును పట్టుకొని నెహ్రూ జూ పార్కు సిబ్బందికి అప్పగించారు.

బతుకమ్మ చీరలు వచ్చేశాయ్



యాచారం: మండలానికి వచ్చిన బతుకమ్మ చీరలు

యాచారం: దసరా పండుగను పురస్కరించుకుని ప్రతి యేటా మహిళలకు పంపిణీ చేసే బతుకమ్మ చీరలు మంగళవారం మండల కేంద్రానికి వచ్చాయి. మండలంలోని 24 గ్రామ పంచాయతీల్లోని మహిళలకు 12,500 చీరలు వచ్చినట్లు ఎంపీడీఓ విజయలక్ష్మి తెలిపారు. త్వరలో పంపిణీ చేస్తామని ఆమె తెలిపారు.

నేటి నుంచి పంపిణీ

షాబాద్: ప్రభుత్వం బతుకమ్మ పండుగకు ఆడపడుచులకు కానుకగా ఇస్తున్న చీరలు సిద్ధంగా ఉన్నాయని ఎంపీడీఓ అనురాధ పేర్కొన్నారు. మంగళవారం మండల కేంద్రం నుంచి మండలంలోని 41 పంచాయతీలకు బతుకమ్మ చీరలను పంపిణీ చేసినట్లు తెలిపారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ... రేపటి నుంచి మండలంలోని అన్ని గ్రామ పంచాయతీల్లో బతుకమ్మ చీరలను పంపిణీ చేస్తున్నట్లు తెలిపారు. మండలానికి 1,560 చీరలు వచ్చినట్లు చెప్పారు. తెల్లరేషన్ కార్డు ఉండి, వయసు 18 ఏళ్లు పైబడిన మహిళలకు 4న ఎమ్మెల్యే కాలె యాదయ్య పంపిణీ కార్యక్రమం ప్రారంభించనున్నారు. కార్యక్రమంలో ఎంపీఓ హన్మంత్‌రెడ్డి, ఏపీఎం నర్సింహులు, పంచాయతీ కార్యదర్శులు, ఐకేపీ సిబ్బంది తదితరులు ఉన్నారు.

ఇబ్రహీంపట్నంలో..

ఇబ్రహీంపట్నం: బతుకమ్మ చీరల పంపిణీకి సిద్ధంగా ఉన్నాయి. మంగళవారం చీరలు మండల పరిషత్ కార్యాలయానికి చేరాయి. ఇక్కడి నుంచి మండలంలోని అన్ని గ్రామ పంచాయతీలకు పంపిణీ చేస్తారు. నేడు(బుధవారం) చర్లపటేల్‌గూడలో లాంఛనంగా ఎమ్మెల్యే కిషన్‌రెడ్డి చేతుల మీదుగా బతుకమ్మ చీరలను పంపిణీ చేయనున్నట్లు మండల అధికారులు తెలిపారు. ఇందుకు సంబంధించిన ఏర్పాట్లను అధికారులు చేస్తున్నారు.

నేడు చర్లపటేల్‌గూడలో..

ఇబ్రహీంపట్నం రూరల్: బతుకమ్మ పండుగను పురస్కరించుకొని ప్రభుత్వం అందజేసే బతుకమ్మ చీరల పంపిణీ కార్యక్రమం విజయవంతం చేయాలని ఇబ్రహీంపట్నం ఎంపీపీ పీ.కృపేష్ పేర్కొన్నారు. మంగళవారం ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. మండలంలోని చర్లపటేల్‌గూడలో నేడు (బుధవారం) ఎమ్మెల్యే మంచిరెడ్డి కిషన్‌రెడ్డి చేతుల మీదుగా లాంఛనంగా పంపిణీ చేయనున్నట్లు తెలిపారు.

వ్యక్తి అదృశ్యం: కేసు నమోదు

తలకొండపల్లి: భార్యతో గొడవపడి బయటకు వెళ్లిన వ్యక్తి అదృశ్యమయ్యాడు. వివరాలు ఇలా ఉన్నాయి.. ఏపీలోని బాపట్లకు చెందిన వెంకటేశ్వరరావు, శివపార్వతి భార్యభర్తలు. వీరు ఐదేళ్ల క్రితం బతుకుదెరువు నిమిత్తం మండల పరిధిలోని గట్టుఇప్పలపల్లికి వలస వచ్చి, భవన నిర్మాణ కూలీలుగా జీవనం సాగిస్తున్నారు. ఈ నెల 1న సాయంత్రం సమయంలో వెంకటేశ్వరావు భార్యతో గొడవ పడి కోపంగా వెళ్లిపోయాడు. తిరిగి రాకపోవడంతో ఆందోళనకు గురైన కుటుంబ సభ్యులు.. తెలిసిన వారు, బంధువులు, స్నేహితులను విచారించినా ఫలితం కనిపించలేదు. దీంతో మంగళవారం పోలీసులకు ఫిర్యాదు చేశారు. శివపార్వతి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని, దర్యాప్తు చేస్తున్నామని ఏఎస్ఐ విష్ణువర్ధన్‌రెడ్డి తెలిపారు.

ఆయుష్మాన్‌భవతో ప్రయోజనం



వైద్య సిబ్బందితో మాట్లాడుతున్న బసంత్‌గార్గ్

డాక్టర్ బసంత్‌గార్గ్

షాద్‌నగర్‌రూరల్: కేంద్ర ప్రభుత్వం అందిస్తున్న ఆయుష్మాన్‌భవ సేవలను ప్రజలందరూ సద్వినియోగం చేసుకోవాలని నేషనల్ హెల్త్ అథారిటీ గవర్నమెంట్ ఆఫ్ ఇండియా అడిషనల్ చీఫ్ ఎగ్జిక్యూటివ్ ఆఫీసర్ డాక్టర్ బసంత్‌గార్గ్ సూచించారు. మంగళవారం పట్టణంలోని ప్రభుత్వ ఆస్పత్రిలో డిప్యూటీ డీఎంహెచ్‌ఓ డాక్టర్ జయలక్ష్మి ఆధ్వర్యంలో మెగా ఆరోగ్య మేళాను నిర్వహించారు. ఈ సందర్భంగా ఉస్మానియా ఆస్పత్రి నుంచి అన్ని రకాల వైద్యాధికారులు హాజరై ప్రజలకు కావాల్సిన వైద్య సేవలను ఉచితంగా అందించారు. రక్తపరీక్షలు, ఈసీజీ పరీక్షలు నిర్వహించి మందులను అందజేశారు. కార్యక్రమానికి డాక్టర్ బసంత్‌గార్గ్ హాజరై మాట్లాడుతూ.. భారత ప్రభుత్వం అందించే ఆయుష్మాన్‌భవ ప్రోగ్రాంలో భాగంగానే ఉచితంగా మెగా వైద్య శిబిరం నిర్వహించడం జరుగుతుందన్నారు. ప్రజలందరు ఆయుష్మాన్‌భవ కార్డులను నమోదు చేసుకోవాలని, ఈ కార్డు ద్వారా ప్రతి సంవత్సరం రూ.5లక్షల బీమాతో వైద్య సేవలను పొందవచ్చని తెలిపారు. అనంతరం జిల్లా వైద్యాధికారి డాక్టర్ వెంకటేశ్వర్‌రావు మాట్లాడుతూ.. నిరుపేదలకు కార్పొరేట్ వైద్య సేవలను అందించేందుకు కేంద్ర ప్రభుత్వం ఆయుష్మాన్‌భవ కార్యక్రమాన్ని తీసుకురావడం జరిగిందన్నారు. 12విభాగాలలో ప్రత్యేక వైద్యాధికారులతో వైద్య శిబిరాలను నిర్వహించడం జరుగుతుందని తెలిపారు. కార్యక్రమంలో ప్రభుత్వ ఆస్పత్రి సూపరింటెండెంట్ డాక్టర్ శ్రీనివాస్‌రెడ్డి, మున్సిపల్ చైర్మన్ నరేందర్, హెల్త్ ఎడ్యుకేటర్ శ్రీనివాసులు, జిల్లా ఆస్పత్రి సూపరింటెండెంట్ రాజుయాదవ్, ఆఫ్తాల్మిక్ ఆఫీసర్ శ్రీహరి, వైద్యులు నందిత, రామకృష్ణ, మల్లిఖార్జున్, శ్రీనివాసరావు, విజయలక్ష్మి, హరికిషన్, రాఘవేందర్, హెల్త్ సూపర్‌వైజర్లు, ఏఎన్ఎంలు పాల్గొన్నారు.